Assemblies Of The Living Elohim (1.Tim 3:15), India Presents.......................

SATYAMUNAKAI PORATA M REGD. NO. 67970/97 REGD. MONTHLY NEWSPAPER

# సత్యమునకై పోరాటం




Editor & Publisher : Bro. Isaac E. Kusuma
MALIKIPURAM - 533 253
E.G.Dt. (A.P.) India
E-mail : iek_personal@sancharnet.in
Phone : 08862-227613
Cell : 9849385038

Postal Regd. No. H/APM/01
Valid upto December 2008
Posted on 30th of Every Month Annual Subscription Rs.50/-
To
Bro/Sis

VOLUME : 10 Nisan-Zif 5768 [April 2007] Pages : 4 Issue : 112

# క్రొత్త నిబంధనలో పస్కా పండుగ

**"పస్కా"** అనగానే అది పాతనిబంధన పండుగలలో ఒకటి, అది ఇశ్రాయేలీయులకే గాని మనకి కాదు అని వాక్యమెరుగని క్రైస్తవుల బోధ. నిజానికి **"పస్కా"** అంటే ఏమిటో క్రైస్తవ బోధకులకు గాని క్రైస్తవ విశ్వాసులకు గాని తెలియనే తెలియదని చెప్పవచ్చును. పాతనిబంధన పస్కాకును క్రొత్త నిబంధన పస్కాకును తేడా చెప్పలేని వారు బైబిలును బోధించుట చూస్తుంటే చాలా విచిత్రంగానే ఉంటుంది. ఇశ్రాయేలీయులు లేక యూదులు పస్కాను ఎలా ఆచరించారు? మెస్సీయ తన శిష్యులతో పస్కాను ఎలా ఆచరించాడు? అని తెల్సుకోవలసిన బాధ్యత ప్రతీ క్రైస్తవునికీ ఉన్నది గదా!

ప్రభురాత్రి భోజనము, సంస్కారము, ప్రభువు బల్ల, బల్లారాధన అంటే మాకు తెలిస్తాది గాని "పస్కా" అంటే మాకు ఎలా అర్థం అవుతాది అని ఒక క్రైస్తవుడు అన్నాడు. నిజమే మరి ఆయనగారు బైబిలు చదివితేగదా! ఎవడో బోధకుడు చెప్పినమాట విని తలఊపడమేగాని అసలు బైబిల్లో ఏమని ఉంది అని ఎప్పుడైనా పరీక్షించి చదివితే గదా "పస్కా" అంటే ఏమిటో తెలియడానికి?

గురువులేని విద్య గుడ్డివిద్య అన్నట్లు, క్రైస్తవులు వాళ్ళగురువును (యషువ మెస్సీయను) వదిలి పనికి మాలిన బోధకులను, వాక్యమెరుగని అంధులను వెంబడించుచున్నందున అయోమయస్థితిలో పడిపోయారు. మెస్సీయ అడుగు జాడలు (1పేతురు 2:21) వెంబడించుట, మెస్సీయను పోలి జీవించుట (1 కొరింథీ 11:1), మెస్సీయ వాడుక (లూకా 4:16) చొప్పున నడచుట తెలియని క్రైస్తవులకు బైబిలు అర్థం అవ్వదు. మత్తయి, మార్కు లూకా, యోహాను సువార్తలు బాగుగా చదివితే మన గురువు అయిన యషువ మెస్సీయ మాదిరి, అడుగుజాడలు తెలిస్తాయి. **ఆయన తన నోటితో "పస్కా" అని చెపితే, దానిని ఈ క్రైస్తవ దొంగ బోధకులు ప్రభురాత్రి భోజనమని, సంస్కారమని, ప్రభువుబల్ల అని, బల్లారాధనని, వేరే పదములతో తప్పుడు అర్థాలు చెప్పి క్రైస్తవులనందరినీ దారి తొలగించారు. అసలు ఈ క్రైస్తవ బోధకులే దయ్యాలు (డెవిల్స్).** గనుకనే "పస్కా" అంటే ఏమిటో ఏ డినామినేషను క్రైస్తవుడికీ తెలియడంలేదు. **"పస్కా"** అంటే ఏమిటి? అని క్రైస్తవులు అడుగుతున్నారంటే, వాక్య విషయంలో వాళ్ళు ఎంత హీనస్థితిలో ఉన్నారో అర్థమవుతుంది. మా ఏరియాలో పేరు మోసిన పెంతెకోస్తు పాస్టరొకడు ఉండేవాడు. అతడికి సహితం **"పస్కా"** అంటే ఏమిటో అర్థం కాలేదు. నాతో వాదిస్తూ పస్కా ఇశ్రాయేలీయులది మనది కాదు అన్నాడు. పెంతెకోస్తు (అంటే వారముల పండుగ) ఇశ్రాయేలీయుల పండుగ మరి నీవు పెంతెకోస్తు సంఘమని పేరు ఎలా పెట్టావు అని అడిగితే, అది క్రొత్త నిబంధనలో ఉంది అన్నాడు. చాలా సంతోషం "పస్కా" కూడా క్రొత్తనిబంధనలోనే ఉంది చూడు అన్నాను.

**క్రొత్త నిబంధనలో "పస్కా"ను గూర్చిన వివరణ చూద్దామా!**

1. **మత్తయి 26:17** శిష్యులు యషువ నొద్దకు వచ్చి - పస్కాను భుజించుటకు మేము నీ కొరకు ఎక్కడ సిద్ధపరచగోరుచున్నావని అడిగిరి.
2. **మార్కు 14:12** ఆయన శిష్యులు - నీవు పస్కాను భుజించుటకు మేమెక్కడికి వెళ్లి సిద్ధపరచవలెనని కోరుచున్నావని ఆయననడుగగా.
3. **లూకా 22:8** యషువ పేతురును యోహానును చూచి - మీరు వెళ్ళి మనము భుజించుటకై పస్కాను మన కొరకు సిద్ధపరచుడని వారిని పంపెను.
4. **యోహాను 12:1** కాబట్టి యషువ తాను మృతులలో నుండి లేపిన లాజరు ఉన్న బేతనియకు పస్కా పండుగకు ఆరు దినములు ముందుగా వచ్చెను.

పై వచనములు అన్నీ పస్కాను గూర్చి వ్రాసినవి. **"పస్కా"** అంటే యషువ మెస్సీయ ఆయన శిష్యులు ఏమి చేసారు? మేకపిల్లను గాని/గొఱ్ఱెపిల్లను గాని చంపి దాని రక్తము ఒలికించి దానిని అగ్నితో కాల్చి చేదుకూరలతో తిన్నారా? లేక రొట్టె - ద్రాక్షారసం త్రాగినారా? వాక్యంలో పరిశీలిద్దాం.

యావె సమాజం వారే కాదు "పస్కా" ఆచరించు ఎవరూ మేకలను/గొఱ్ఱెలను బలి యివ్వరు. యషువ మెస్సీయయే పస్కా పశువుగా (1 కొరింథీ 5:7) బలియైన సంగతి వారందరికీ బాగుగా తెలుసు. యషువ మెస్సీయ యూదులవలె (మార్కు 14:12 / లూకా 22:7) పస్కా పశువును వధించలేదు. ఆయనే మన పస్కా పశువు (1 కొరింథీ 5:7) లోక పాపమును తీసివేయు ఎలోహీం గొఱ్ఱెపిల్ల (యోహాను 1:29). యూదులు చేయుచున్న పస్కా పండుగకు, యషువ మెస్సీయ చేయుచున్న పస్కా పండుగకు తేడా తెలియని క్రైస్తవ జనాంగమునకు క్రొత్త నిబంధన మార్గము మాత్రము ఏమి తెలుసు?

మెస్సీయ పస్కాను యూదులు ఆచరించిన విధంగా (మార్కు 14:12/లూకా 22:7) ఆచరించలేదు. యావె నియామక కాలమును అనుసరించి క్రొత్త నిబంధన పద్ధతిలో పస్కా ఆచరించాడు.

**అయితే "పస్కా" ఎప్పుడు?**

| | | |
|---|---|---|
| 1. | **నిర్గమ 12:1-28** | మొదటి నెల 14వ దినము (అంటే నీసాను 14) |
| 2. | **లేవీ 23:5-8** | మొదటి నెల 14వ దినమున సాయంకాలమందు |
| 3. | **సంఖ్యా 28:16** | మొదటి నెల 14వ దినమున యావెకు **పస్కా** పండుగ |
| 4. | **యెహోషువ 5:10** | ఇశ్రాయేలీయులు గిల్గాలులో దిగి ఆ నెల పదునాలుగవ తేదీన సాయంకాలమున యెరికో మైదానములో **పస్కా** పండుగను ఆచరించిరి. |
| 5. | **యెహెజ్కేలు 45:21** | మొదటి నెల పదునాలుగవ దినమున **పస్కా** పండుగ ఆచరింపవలెను. |
| 6. | **ఎజ్రా 6:19** | చెరలో నుండి విడుదల నొందినవారు మొదటినెల పదునాలుగవ దినమున **పస్కా** పండుగ ఆచరించిరి |
| 7. | **ద్వితీ 16:1** | సంఖ్యా 9:2-4, 2 రాజులు 23:21, 2 దినవృ 35:1, మొ॥నవి. సంఖ్యా 9:6-14, 2 దినవృ 30:2,3,13-15. |

**క్రొత్త నిబంధనలో "పస్కా"**

| | | |
|---|---|---|
| 1. | **లూకా 2:41** | **పస్కా** పండుగప్పుడు ఆయన తలిదండ్రులు ఏటేట యెరూషలేమునకు వెళ్లుచుండువారు (నిర్గమ 13:10) |
| 2. | **లూకా 2:42** | ఆయన పండ్రెండేండ్లవాడైయున్నప్పుడు ఆ **పండుగ** నాచరించుటకై వాడుక చొప్పున వారు యెరూషలేమునకు వెళ్లిరి. |
| 3. | **మత్తయి 26:18,19** | యషువ తమ కాజ్ఞాపించిన ప్రకారము శిష్యులు చేసి **పస్కా**ను సిద్ధపరచిరి. |
| 4. | **మార్కు 14:16** | శిష్యులు వెళ్లి పట్టణములోనికి వచ్చి ఆయన వారితో చెప్పినట్టు కనుకొని **పస్కా**ను సిద్ధపరచిరి. |
| 5. | **లూకా 22:13** | వారు వెళ్ళి ఆయన తమతో చెప్పినట్టు కనుగొని **పస్కా**ను సిద్ధపరచిరి. |
| 6. | **యోహాను 12:1** | **పస్కా** పండుగకు ఆరు దినములు ముందుగా వచ్చెను. |
| 7. | **1 కొరింథీ 5:7** | మెస్సీయ అను మన **పస్కా** పశువు వధింపబడెను. అటులనే ఈ వాక్యములు చదవండి. అ॥కార్య 12:4, 1 కొరింథి 11:23. |

పాతనిబంధన గ్రంథంలో స్పష్టముగా చెప్పిన దానినే క్రొత్త నిబంధనలో మనం చేస్తున్నాము. మెస్సీయ చేసిన మార్పులు మనం గమనిస్తే సరిపోతుంది. క్రైస్తవ బోధకులు మొత్తానికి అసలు పదాలు తీసేసి అర్థాలు మార్చేసి బోధించుట ఏమిటి?

ఇది ఒక ఆచారం, దాంతో మనకి సంబంధంలేదు అని ఒక బోధకుని విమర్శ. నిజమే, ఇది యావె ఇచ్చిన ఆచారం : నిర్గమ 12:26 / 13:9 తప్పనిసరిగా చేయవలసినదే. యావె ఆచారమును కాదనే హక్కు మానవునికి లేదు.

**ఆచారములు రెండు రకాలు :**

1. పరమతండ్రి యిచ్చిన ఆచారం (నిర్గమ 12:26; 13:9)
2. మానవుడు నిర్ణయించిన ఆచారం (మత్తయి 15:9; అ॥కార్య 16:21)

మానవ ఆచారములను బైబిల్ ఖండిస్తున్నది. మత్తయి 15:9, కొలస్సీ 2:20, తీతు 1:14, యెషయా 29: 13, మీకా 6:16, హోషేయ 5:11.

**అసలు ఆచారం అంటే ఏమిటి?**

**ఏదైనా ఒక పనిని రొటీన్‌గా చేయడమే గదా ఆచారం అంటే :** కాదని చెప్పగలరా? మనం నిద్రలేచిన దగ్గర నుండి నిద్ర పోయేవరకూ చేసే పనులన్నీ ఆచారములే కాదా? ఆదివారం గుడికివెళ్లడం, గుడ్‌ఫ్రైడే రోజున ఏడ్వడం, ఈస్టర్ ఆదివారమున ఆనందించడం, డిశెంబర్‌లో క్రిస్‌మస్ చెయ్యడం, డిశెంబర్ 31 వాచ్‌నైట్ సర్వీస్ చెయ్యడం, జనవరి 1 క్రొత్త సంవత్సర ఆరాధన చెయ్యడం, పాటలు పాడటం, వాక్యం చదవడం వినడం, ప్రార్థనలు చెయ్యడం, ఇవన్నీ ఆచారములు కావా? ఇవి మానవులు పెట్టిన ఆచారములు. కాని యావె ఆచారములు వేరు. ఆయన పెట్టిన ఆచారములకు ఒక అర్థముంది. నిర్గమ 12:26 చదవండి తెలుస్తుంది. **పస్కా** చరిత్రను సూచిస్తుంది, మెస్సీయను తెలియపరుస్తుంది. పస్కాను గూర్చి ఎన్నో చెప్పవచ్చును. మీరు చేసే ఆచారాలకు ఉన్న అర్థము లేమిటి? అన్నీ అబద్ధాలేగదా!

1. ఆదివారం పునరుత్థానం అనే మీ మానవ ఆచారం అబద్ధం.
   **అది నీసాను 17వ తేదీ ఆయన పునరుత్థానం.**
2. గుడ్‌ఫ్రైడే అనే మీ మానవ ఆచారం అబద్ధం.
   **అది నీసాను 14వ తేదీ ఆయన మరణం.**
3. లెంట్ అనే మీ మానవ ఆచారం అబద్ధం.

**అది బైబిలు ఖండితంగా చెప్పనిది.**

4. డిశెంబరులో ఆయన జన్మదినం అనే మీ మానవ ఆచారం అబద్ధం
   **ఏతనీము 15వ తేదీ ఆయన జన్మదినం.**
5. డిశెంబర్ 31 వాచ్‌నైట్ సర్వీస్ అనే మీ మానవ ఆచారం అబద్ధం.
   **అదారు అనే 12వ నెల ఆఖరిరోజుతో సంవత్సరం అంతం అవుతుంది.**
6. జనవరి 1 క్రొత్త సంవత్సరము అనే మీ మానవ ఆచారం అబద్ధం.
   **నీసాను 1 క్రొత్త సంవత్సరము.**
7. మిరిచ్చే రొట్టె-ద్రాక్షారసం అనే మీ మానవ ఆచారం అబద్ధం.
   **పస్కా అనునది ఆయన ఇచ్చిన ఆజ్ఞ.**

– ఇలా చెప్పుకుంటూ వెళ్లితే క్రైస్తవులు చేసే ఆచారాలన్నీ వాక్య విరుద్ధమే. అసలు క్రైస్తవ్యమే ఒక పెద్ద అబద్ధాల పుట్ట. పెళ్ళిళ్ళ దగ్గర మీరు చేసే ఆచార సాంప్రదాయాలు తప్పు కాదా? కట్నాలు తీసుకోవడం అన్యుల ఆచారం, అది మీరు వదలలేదే? లంచాలు తీసుకోవడం అన్యుల బుద్ధి, అదీ వదల లేదే? త్రాగుడు, వ్యభిచారం, మోసం, అన్నీ క్రైస్తవులలో కనిపిస్తూనే ఉన్నాయి. అల్లుళ్ళను ఒక చూపు కొడుకులను ఒక ఇంకోచూపు, కూతుర్లను ఒక చూపు కోడళ్ళను ఇంకో చూపు! అవన్నీ అన్యుల బుద్ధులు (ఆచారాలు) కావా? అవకాశం దొరకాలే గాని ఏదీ వదలరు ఎక్కడా తగ్గించుకోరు గాని సత్యము విషయము దగ్గరకొచ్చేసరికి మాత్రం ఆచారమనడం ఎంత సమంజసమో మీకు మీరే స్వపరీక్ష చేసుకోండి. మీ వివాహ తేదీలు, మీ పుట్టిక తేదీలు, మీ వాళ్ళ చనిపోయిన తేదీలు : ఆ తేదీల్లో మీరు ఆడే నాటకాలు, మీరు ప్రదర్శించే హంగు ఆర్భాటం ఆచారాలు కావా? పరమ తండ్రి ఆచారములను వెక్కిరించకండి పతనమైపోతారు జాగ్రత్త.

### "పస్కా" రొట్టె మరియు సాధారణ రొట్టె

క్రైస్తవ బోధకులెవరికీ **పస్కా** రొట్టెకు సాధారణ రొట్టెకు తేడా తెలియదు. **పస్కా** రొట్టె సం॥రానికి ఒక్కసారే విరుస్తారు (నిర్గమ 13:10, లూకా 2:41) మెస్సీయ తన పరిచర్య $3^{1/2}$ సం॥లలో ఎన్నో రొట్టెలు విరిచి ప్రజలకు పంచినప్పటికీ అవి అన్నీ **పస్కా** రొట్టెలు కావు.

| | | |
|---|---|---|
| 1. | 5000 మంది తినిన రొట్టెలు | – మత్తయి 14:15-21. |
| 2. | 4000 మంది తినిన రొట్టెలు | – మార్కు 8:1-9 |
| 3. | అపోస్తలుడైన సౌలు ఓడలో విరిచిన రొట్టె | – అ॥కార్య 27:33-35. |
| 4. | మెస్సీయ ఎమ్మాయి మార్గంలో విరిచిన రొట్టె | – లూకా 24:30-35. |
| 5. | శిష్యులు ఇంటింటా విరిచిన రొట్టె | – అ॥కార్య2:46,47. |
| 6. | సౌలు అర్ధరాత్రి తినిన రొట్టె | – అ॥కార్య 20:7-12. |
| 7. | అనుదిన ఆహారము (రొట్టె) | – మత్తయి 6:11. |
| 8. | క్షయమైన ఆహారము (రొట్టె) | – యోహాను 6:26,27. |

మొ॥లగు ఇవన్నీ సాధారణ రొట్టెలు. ఇవి **పస్కా**కు సంబంధించిన రొట్టెలు కావు.

మరి పస్కా రొట్టె ఎక్కడుందంటారా?

| | | |
|---|---|---|
| 1. | మత్తయి 26:6 | పస్కా రొట్టె |
| 2. | మార్కు 14:22 | పస్కా రొట్టె |
| 3. | లూకా 22:19 | పస్కా రొట్టె |
| 4. | యోహాను 13:26 | పస్కా రొట్టె |
| 5. | 1కొరింథి 11:23 | పస్కా రొట్టె |

ఈ **పస్కా** రొట్టె యషువ మెస్సీయ శరీరమునకు సాదృశ్యం. ద్రాక్షారసం ఆయన రక్తానికి సాదృశ్యం. పాద ప్రక్షాళన ఉంది. ఈ **పస్కా** రొట్టె తినుటకు ముందుగా ఒకరి పాదములను ఒకరు కడుగుకోవలసినదిగా మెస్సీయ ఆజ్ఞాపించాడు. యోహాను 13:14,15. ఒకరి పాదములు ఒకరు కడుగుట అనే అలవాటు క్రైస్తవ సంఘాలలో మచ్చుకైనా కనబడదు. అంటే మెస్సీయ మాటకు అసలు విలువ లేదన్నమాట. ఇంటింటా రొట్టె విరిచారని ఒకడు, ఆదివారం రొట్టె అని మరొకడు, ఎవడి యిష్టం వచ్చిన రీతిలో వాడు ఈ **పస్కా**ను మరుగుచేసి నాటకాలు ఆడుతున్నారు. వాక్యమును సరిగా విభజించలేని దొంగ బోధకులు పాస్టర్లుగా చలామణి అవుతూ క్రైస్తవులనందరినీ మోసంలో ముంచివేసారు. **పస్కా** యొక్క విలువ తెలియని క్రైస్తవులు పస్కా ఆచరించువారిని విమర్శించుట తగునా?

### "పస్కా" ఆచరించకపోతే :

1. ***ఆయన సమాజంలో నుండి కొట్టివేయబడతారు. సంఖ్యా 15:30,31.***
2. ***ఆయనతో పాలుపంపులు ఉండవు. యోహాను 13:4-9.***
3. ***తప్పక హాజరు అవ్వవలసిన ఆజ్ఞ. ద్వితీ 16:16.***
4. ***సాకులకు, సంశయాలకు క్షమాపణలేనిది హెబ్రీ 10:26,27.***
5. ***నిత్యజీవము ఉండదు, అంత్యదినమున జీవమునకు లేపబడరు. యోహాను 6:54.***
6. ***ఆజ్ఞాతి క్రమము క్షమించరానిది. యోహాను 13:***
7. ***అన్ని సమాజములు ఆచరించవలసినదే. 1 కొరింథీ 4:17, 7:17, 14:33, 2 కొరింథీ 11:28.***

గనుక ప్రియ సహోదరుడా! ప్రియసహోదరీ! **పస్కా**లో పాలుపొందండి. **పస్కా** ఈ సం॥ము ఏప్రిల్ 1వ తేదీ రాత్రికి వచ్చినది. గనుక మీరంతా వచ్చి **పస్కా**లో పాలుపంపులు పొందవలసినదిగా ప్రేమపూర్వకంగా ఆహ్వానించుచున్నాము.

**పస్కా**కు వచ్చువారు అందరూ తెల్లని వస్త్రములు ధరించవలెను. పరలోక సైన్యసమూహము (ప్రకటన 19:14) తెల్లని వస్త్రములు ధరించినవారై యున్నారు. ఎల్లప్పుడు తెల్లని వస్త్రములు ధరించుకొనుమని ప్రసంగి 9:8 ఋజువు చేయుచున్నది. తెల్లని వస్త్రముల పరిశుద్ధతకు సాదృశ్యము గనుక పరిశుద్ధుల పండుగలలో అందరూ ఆ క్రమమును పాటించవలెను.

దూరము నుండి వచ్చువారు ముందుగా మాకు తెలియపర్చవలెను. బాప్తిస్మము పొందువారు మార్చి 31వ తేదీనకే రావలసి ఉంటుంది. 31వ తేదీ 3-5 గం॥ల మధ్య బాప్తిస్మము లివ్వబడును. అందరూ సమాజక్షేమాభివృద్ధి కొరకు మాతో సహకరించగలరని ఆశిస్తున్నాము.

# నిత్యజీవమును చేరుకొనుటకు పాటించవలసిన ఆజ్ఞలు ఏమిటి?

*సహో. ఎ. సంజయ్ కిరణ్*, వరంగల్, Mobile: 9885737764

ప్రియమైన ఎలోహీం పిల్లలరా! ఎలోహీం పరిశుద్ధ నామమున మీ అందరికి షాలోమ్. మనం జీవిస్తున్న ప్రస్తుతకాలములో ఎన్నో ఆధ్యాత్మిక బోధలు వింటున్నాము. ఈ బోధలు అన్నికూడా మనిషి పరలోకం లేక స్వర్గము చేరుకోవాలి అనే విషయముపై ప్రధానంగా ఆధారపడి ఉంటున్నాయి. ఎలోహీం పిల్లల లక్ష్యము ఒకటే, పరలోకం లేదా నిత్యజీవమునకు పోవటం. కాని నిత్యజీవానికి ఎలా పోవాలో ఎవరూ అంత ఎక్కువగా ఆలోచించరు.

మన పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో మెస్సీయను ధర్మశాస్త్ర ఉపదేశకుడు మంచి ప్రశ్న అడుగుతున్నాడు. లూకా 10:25 వాక్యాన్ని చూస్తే **"నిత్యజీవమునకు వారసుడగుటకు నేనేమి చేయాలి?"** అనే ఒక మంచి ప్రశ్న సర్వాధికారిని శోధిస్తూ అడుగుతాడు. దానికి మెస్సీయ ఇచ్చిన సమాధానము ధర్మశాస్త్రమందేమి వ్రాయబడి ఉన్నది? నీవేమి చదువుచున్నావని అడుగుతాడు. దానికి అతడు నీపూర్ణ హృదయముతోను, నీపూర్ణమనసుతోను, నీపూర్ణశక్తితోను, నీపూర్ణ వివేకముతో నీఎలోహీంని ప్రేమించవలెనని, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించవలెనని వ్రాయబడి ఉన్నదని చెప్పాడు. మెస్సీయ అతనితో నీవు సరిగా ప్రత్యుత్తరము ఇచ్చితివి నీవు వెళ్ళి అలాగు చేయమని సెలవిస్తాడు.

ఎలోహీం బిడ్డలారా! కేవలం రెండు ఆజ్ఞలు పాటిస్తే నిత్యజీవమిస్తానని సర్వాధికారి సెలవిస్తున్నాడు. ఇంతకీ రెండు ఆజ్ఞలు పాటించడమెలా? ముందు మనకు ఎలోహీంని ప్రేమించటమంటే ఏమిటో తెలియాలి. "1 యోహాను 5:3 లో **ఎలోహీం** ఆజ్ఞలు గైకొనుటయే **ఎలోహీంని** ప్రేమించుట అని ఉంది. ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు అని కూడా ఉంది". అనగా ఎలోహీంని పూర్ణబలముతో పూర్ణశక్తితో, పూర్ణ హృదయముతో ప్రేమించుట అంటే ఆయన ఇచ్చిన ప్రతి ఆజ్ఞను పాటించుటయే. ఆజ్ఞలు గైకొనకుండా మనము ఎలోహీంని ప్రేమించలేము. అదే విధముగా 2 యోహాను 1:6లో ఆయన ఆజ్ఞల ప్రకారము నడుచుకొనుటయే ప్రేమ అనిఉంది. అంటే నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలి. అనగా ఆజ్ఞలు పాటించాలి.

ఈ మధ్యకాలములో చాలా మంది బోధకులు ఆజ్ఞలు లేవని ఆజ్ఞలు కొట్టివేయబడినవని చెప్పుచూ ప్రధానమైన రెండు ఆజ్ఞలు పాటిస్తే చాలు అని బోధిస్తున్నారు. అసలు ఈ రెండు ఆజ్ఞలు ఎలా పాటించాలో తెలియదు. కాని మేమే ఎలోహీంకి ఇష్టులము, కష్టపడేవాళ్ళము అనుకుంటూ వారి స్వంతజ్ఞానముతో రెండు ఆజ్ఞలకు వివరణలు ఇస్తూ అసలు ఎలోహీం ఆజ్ఞలు పాటించకుండా చేస్తున్నారు. కేవలం రెండు ఆజ్ఞలు పాటిస్తే నిత్యజీవమని మెస్సీయ ఎందుకు చెప్పాడో ఎవరూ ఆలోచించుటలేదు. ***మెస్సీయ రెండు ఆజ్ఞలు పాటిస్తే చాలు అన్నది ఒక ధర్మశాస్త్ర ఉపదేశకుడితో అతడికి ఎలోహీం ధర్మాలు (ఆజ్ఞలు) అన్నీ తెలుసు. అందుకే సర్వాధికారి ఆజ్ఞలన్నీ రెండు ఆజ్ఞలలో ఇమిడియున్నాయి కనుక అలా చెప్పాడు.***

1. **నీ ఎలోహీం అయిన యావెను నేనే.**
2. **నేను తప్ప వేరొక ఎలోహీం నీకు ఉండరాదు.**
3. **నీ ఎలోహీం అయిన యావె నామమును వ్యర్థముగా ఉచ్ఛరింపకూడదు.**
4. **విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించవలెను.**
5. **నీ తల్లిదండ్రులను సన్మానించవలెను.**
6. **నరహత్య చేయకూడదు.**
7. **వ్యభిచరింపకూడదు.**
8. **దొంగిలకూడదు.**
9. **నీ పొరుగువాని మీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు.**
10. **నీ పొరుగువానిదేదీ ఆశించకూడదు.**

***పై 10 ఆజ్ఞలను క్రమములో చూసినట్లయితే అందులో 1 నుండి 4 ఆజ్ఞలు ఎలోహీం కొరకు మానవుడు పాటించవలసినవి. అనగా ఎలోహీంని ప్రేమించవలసిన ఆజ్ఞలు. ఇక 5 నుండి 10 వరకు ఉన్నవి. మనిషికి, మనిషికి మధ్య ప్రేమను తెలిపే ఆజ్ఞలు. మెస్సీయ పాటించమని చెప్పిన రెండు ఆజ్ఞలలో ఈ 10 ఆజ్ఞలు ఇమిడిఉన్నాయన్న సత్యాన్ని ఆలోచించాలి.*** ధర్మశాస్త్రములో ఈ 10 ఆజ్ఞలతో పాటు ఎన్నో ఆజ్ఞలు వ్రాయబడి ఉన్నవి. ఉదాహరణకు నిర్గమ 23:1-8 వాక్యాలలో లేని వార్తను పుట్టింపకూడదు, అబద్ధసాక్ష్యము పలుకకూడదు, బీదవాడని పక్షపాతము చూపవదు, లంచము తీసుకొనకూడదు మొదలగు ఆజ్ఞలు కనిపిస్తాయి.

లేవీకాండ 19:9-19లో బీదలను పరదేశులను జ్ఞాపకము చేసుకోవాలని, ఏనాటి కూలి ఆనాడే ఇవ్వాలని, నీ హృదయములో నీ సహోదరుడి మీద పగ పెట్టుకోకూడదు, కీడుకు ప్రతికీడు చేయకూడదు, నీ ప్రజల మీద కోపము ఉంచుకొనక నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను మొదలగు ఎన్నో ఆజ్ఞలు చూడగలము.

నిర్గమ 21:33లో గోతిని తవ్వి కప్పివేయాలని చెప్పే నిబంధన. ద్వితీయో 22:8లో నీ సహోదరుడెవరైనా కొత్తగా కట్టిన నీ ఇల్లు పై నుండి పడుట ద్వారా హత్యాదోషము నీకు రాకుండా ఉండుటకు పిట్టగోడ కట్టుకోవాలి అనే ఆజ్ఞలన్ని ఆలోచిస్తే నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించాలని చెప్పేవే. అందుకే మెస్సీయ మత్తయి 7:12లో మనుష్యులు మీకు ఏమి చేయవలెనని కోరుదురో అలాగునే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును, ప్రవక్తల ఉపదేశమునై ఉన్నదని సెలవిస్తున్నాడు.

ఎలోహీం మనలను ఒక సంకల్పముతో నిర్మించాడని వాక్యము సెలవిస్తుంది. ఎఫెసీ 1:4-6 లో మనము తన ఎదుట పరిశుద్ధులముగాను, నిర్దోషులముగాను ఉండుటకు జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత మనలను మెస్సీయలో ఏర్పరచుకొనెను. అనగా మనము భూమి మీద పరిశుద్ధులుగా, నిర్దోషులుగా బ్రతకాలని ఎలోహీం సంకల్పము. ఎలా బ్రతుకగలము? ఆయన ఇచ్చిన ఆజ్ఞలు గైకొని మాత్రమే పరిశుద్ధులం కాగలము.

ఎలోహీం ఇచ్చిన 10 ఆజ్ఞలు ఖచ్చితంగా పాటించాలి. లేవీ 23:3లో విశ్రాంతిదినమును పరిశుద్ధ సమాజముగా కూడుకోవాలి. లేవి 23: 9-44లో నియామక కాలములలో పరిశుద్ధ సమాజముగా కూడుకోవాలి. లేవీ 11:1-46 ఆయన ఆజ్ఞాపించినట్లు అపవిత్రమైనవాటిని తినకూడదు. లేవి 18:6-20 లో వావివరుసలు పాటించాలి. మొదలగు ఆజ్ఞలన్ని గైకొనుట ద్వారా పరిశుద్ధులము, నిర్దోషులము కాగలము. ఊరికే డైలాగులతో అవ్వము. యెహెజ్కేలు: 18:5-9లో ఆజ్ఞలను పాటించేవారిని ఎలోహీం నిర్దోషులు అంటున్నాడు. ప్రతి నియామక కాలమున, విశ్రాంతిదినమున ఎంత పరిశుద్ధముగా ఉన్నది పరీక్షించుకోవాలి. సమాజముగా కూడుకొని ఆజ్ఞలను ధ్యానించాలి. ఒకరినొకరు

హెచ్చరించుకోవాలి. అందుకే సౌలు గారు హెబ్రి 10:24లో సమాజముగా ఖచ్చితముగా కూడుకోవాలి అంటున్నాడు. అప్పుడే పరమతండ్రి సంకల్పాన్ని సంపూర్ణంగా తెలుసుకొని నెరవేర్చినవారమవుతాము. అదే విధంగా ఎలోహీం ఇచ్చిన ధర్మశాస్త్రములోని ఆరోగ్య సూత్రాలు, న్యాయసూత్రాలు, వ్యవసాయ సూత్రాలు, సామాజిక, సాంఘిక సూత్రాలు మొదలగు ఆజ్ఞలను గైకొంటే ఈ భూమి మీద కూడా శాంతి, సమాధానములతో బ్రతకగలము. మనుష్యులకు ఆదర్శము కాగలము. మన మాదిరి జీవితము ద్వారా అనేకులను ఎలోహీం వైపు తిప్పగలము.

ధర్మశాస్త్రమంతా గైకొనాలా? అనే ధర్మసందేహము వద్దు. ధర్మశాస్త్రములోని బలి, అర్పణ, నైవేధ్యము మొదలగు ఆజ్ఞలు ఇప్పుడు అవసరము లేదు. అదే విధముగా ప్రత్యక్ష స్థలము అంటే ప్రత్యక్ష గుడారము యావె ఆలయము, అతిపరిశుద్ధ స్థలము, ప్రధాన యాజకత్వము, సేవా పద్ధతులు మొదలగు ఆజ్ఞలు ఇప్పుడు లేవు. అదే విధముగా ప్రత్యక్ష దేశమునకు (పాలు, తేనెలు ప్రవహించు దేశము) సంబంధించిన శత్రువులను సంహరించుట, విగ్రహాలను పగులగొట్టుట, మొదలగు ఆజ్ఞలు మనకు వర్తించవు. అదే విధముగా ఇప్పుడు తీర్పులు అంటే రాళ్ళతోచంపడం వంటి తీర్పులు తీర్చరాదు. ఎందుకంటే మెస్సీయకు పూర్వము తీర్పులు ఎలోహీం తీర్చేవాడు. న్యాయాధిపతి అంటే ఎలోహీం నిర్గమ 22:9. ఎందుకంటే అప్పుడు ఉన్నది ఎలోహీం సర్వాధికారిగా ఉండిన ప్రభుత్వము ఎలోహీం దగ్గర ఉండి తీర్పులు తీర్చేవాడు. ఉదాహరణకు యెహూషువా 7:10-26లో ఆకానుకు ఎలోహీం దగ్గర ఉండి తీర్పు తీర్చినాడు. ఎలోహీం రాజులను నాయకులను ప్రవక్తలను ఎన్నుకున్నాడు. ఎన్నో అద్భుతాలు చేయించాడు. మన్నాను కురిపించాడు. ఇశ్రాయేలీయుల 40 సంవత్సరాల ప్రయాణములో బట్టలు మాయలేదు, చెప్పులు అరగలేదు. అంటే అది ఎలోహీం దగ్గర ఉండి నడిపిన ప్రభుత్వము అని చెప్పవచ్చు. మెస్సీయ మనకోసము భూమి మీదకు వచ్చిన తరువాత తీర్పులు తీర్చకూడదని సెలవిస్తున్నాడు. మరణశిక్ష వంటి తీర్పులు ఇప్పుడు తీర్చరాదు. రోమా 2:1-5, 2 కొరంథి 5:10 యాకోబు 4:12 వాక్యాలలో తీర్పులు తీర్చకూడదని సెలవిస్తున్నది.

ఎలోహీం ఇచ్చిన బైబిల్‌ను రెండు ముక్కలు చేసి పాతనిబంధన ఇశ్రాయేలీయులకు అని కొత్తనిబంధన మనకోసమని బైబిల్ చదవకుండా మొత్తం బైబిల్ మనకోసమే అనుకొని క్రమపద్ధతిలో చదివితే ఎలోహీం ఆజ్ఞలు తెలుస్తాయి. ఏ ఆజ్ఞలు ఉన్నవి, ఏవి నిరర్ధకము అయినవో తెలుస్తాయి.

కొత్తనిబంధనలో కూడా లూక 14:12-14లో మెస్సీయ బీదలను, అంగహీనులను, కుంటివారిని, గుడ్డివారిని విందుకు పిలవమనుచున్నాడు. గలతి 2:10లో బీదలకు సహాయము చేయాలని ఉంది. యాకోబు 1:27లో దిక్కులేని పిల్లలను, విధవరాళ్ళను ఆదుకోవాలనిఉంది. యాకోబు రెండో అధ్యాయమంతా ధర్మసంబంధ క్రియలు చేయాలని, ఊరికే మెస్సీయ నందు విశ్వాసముంది అని అంటే సరిపోదని తెలియజేస్తుంది. యాకోబు 5:4లో ఏనాటికూలి ఆనాడు ఇచ్చివేయాలని ఉంది.

1.కొరింథి 6:9-10లో ఆజ్ఞలు పాటించని వారు ఎలోహీం రాజ్యానికి వారసులు కారు అని ఉంది. ఇంకా అనేక వాక్యాలు ఎలోహీం ఆజ్ఞలు గైకొనాలని సెలవిస్తున్నాయి. కొండమీది ప్రసంగములో మత్తయి 5:17-19 వాక్యాలను చూస్తే ధర్మశాస్త్రాన్ని గాని, ప్రవక్తల వచనాలను నెరవేర్చుటకే వచ్చానని కొట్టివేయుటకు రాలేదని స్పష్టంగా చెబుతున్నాడు. అల్పమైన ఆజ్ఞలు కూడా పాటించాలని పాటించకుంటే పరలోకములో అల్పులము అవుతామని చెబుతున్నాడు. ***ఆయన బోధలన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే, పితృపారంపర్య ఆచారాలతో కలుషితమైన ఆజ్ఞలను సరిచేస్తూ, ఆజ్ఞలన్నింటిని బలోపేతము చేస్తున్నట్లు తెలుస్తుంది.*** ఆజ్ఞలలోని గొప్పతనాన్ని విశిష్టతను తెలియజేసి, ఆజ్ఞలను ఖచ్చితముగా హృదయపూర్తిగా పాటింపజేస్తున్నాడు, అంటే ధర్మాన్ని స్థిరపరుస్తున్నాడు, కొట్టివేయుట లేదు. ప్రియమైన ఎలోహీం పిల్లలారా! ఆదాము మొదలుకొని ఎలోహీం ధర్మము ఉంది. ఆ ధర్మాన్ని పిల్లలు పాటించి, పరిశుద్ధులుగా, నిర్దోషులుగా ఉండాలన్నది ఆయన అనాది సంకల్పము. ఆయన ధర్మమంటే ఆజ్ఞలే. మనకు మరణానికి మూలము పాపమని, పాపానికి కారణము ఆజ్ఞాతి క్రమమని తెలుసు. మరి ఆజ్ఞపుట్టుటకు కారణము ఆయన ధర్మమే. తల్లిదండ్రులను సన్మానించుట, నరహత్య చేయవదు, ఆశించవద్దు మొదలగునవన్ని ఆయన ధర్మాలు లేక ఆజ్ఞలు. ఎలోహీం పిల్లలుగా ఆయన ఆజ్ఞలు పాటించుటయే మన విధి. ఎలోహీం ధర్మాన్ని ఆజ్ఞలను పాటించకుండా ఎవరూ పరలోకము వెళ్ళరని మత్తయ 7:21-23 వాక్యాలను చూస్తే తెలుస్తుంది. 23 వ వచనములో అక్రమము చేయువారులారా, నా యొద్ద నుండి తొలగిపొండని మన తెలుగు తర్జుమాలో ఉంది. కాని ఒరిజినల్ భాషలో ధర్మశాస్త్ర విరోధులారా (క్రమాన్ని పాటించనివారలారా) నాయొద్ద నుండి తొలగిపొండనిఉంది. ఎలోహీం ఆజ్ఞలు పాటించకుండా వాక్యాన్ని ప్రకటించాము, అద్భుతాలు చేశాము, దయ్యాలు వెళ్ళగొట్టాము అనుకుంటూ జీవిస్తే నిత్య జీవములో ప్రవేశించలేము.

ఎలోహీం తీర్పు ధర్మాన్ని బట్టి జరుగుతుంది. మోషే ప్రవక్తలు ప్రవచించినా వినకుండా ధర్మాన్ని పాటించనందుకే ధనవంతుడికి నిత్యశిక్ష విధించబడినది. లూకా 16-19 మెస్సీయ వివరించిన కుడి వైపు గొర్రెలు, ఎడమవైపు మేకలు ఉపమానము మత్తయి 25:31-46లో తీర్పు అనేది ధర్మాన్ని బట్టి జరుగుతుంది. ధర్మాన్ని పాటిస్తే నిత్యజీవము ధర్మాన్ని పాటించకుంటే నిత్యశిక్ష అని స్పష్టంగా చెబుతుంది.

చివరగా నేడు చాలా సంఘాలలో ఎలోహీం ధర్మాలు (ఆజ్ఞలు) లేవు. కేవలము మనుష్యుల కట్టడలను యావె ఉపదేశాలు అనుకొంటూ తమకు తెలిసిన సువార్తను బోధిస్తూ, జీవిస్తున్నారు. మెస్సీయను నమ్మితేచాలు పరలోకము వెళ్ళిపోతాము అనుకుంటే పొరపాటే. మెస్సీయను హృదయపూర్తిగా అంగీకరించి ఎలోహీంపై సంపూర్ణ విశ్వాసముతో ఎలోహీం ఇచ్చిన ఆజ్ఞలను గైకొంటేనే నిత్యజీవము వస్తుంది. రోమా7:12&14 వాక్యాలను బట్టి ఆజ్ఞ పరిశుద్ధమైనదని, నీతిగలదని, ఉత్తమమైనదని, ధర్మశాస్త్రము ఆత్మసంబంధమైనదని సెలవిస్తుంది. ఆజ్ఞ శరీరసంబంధమైనదని అజ్ఞానముగా ఆలోచించక, లేఖనాలను పరిశీలించి ఆత్మసంబంధమైనదని గ్రహించగలము. ఎందుకంటే 2యోహాను 2:4లో ఎలోహీం ఎరిగియున్నామని చెప్పుకొనుచు ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు వానిలో సత్యము లేదు అని వాక్యము సెలవిస్తుంది. కాబట్టి సంపూర్ణ సత్యాలను తెలుసుకొని మెస్సీయ ఆజ్ఞాపించునట్లు ఆయన రాజ్యసువార్తను ప్రకటిస్తూ, నామాన్ని ప్రకటిస్తూ, ఆయన మరణ సమాధి పునరుద్ధరణను ప్రకటిస్తూ, ఎలోహీం ధర్మాన్ని పాటిస్తూ, ఎలోహీం ఇచ్చిన జీవితము ఎలోహీం కోసమును వినియోగిద్దాము.

గమనిక: లేఖనాల పరిశీలన మరియు సందేహాల నివృత్తి కొరకు ఈ క్రింది అడ్రసులో జరిగే సెమినార్‌కు రాగలరు.

**ఇంటర్‌నేషనల్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్**
**లష్కర్‌బజార్ పెట్రోలుపంపు ఎదురుగా, హన్మకొండ.**
**ఫోన్: 9885737764, 9346311674**

# మాయదారి రోగాలను నివారించే దెలా?

***సహో. ఎ. సంజయ్ కిరణ్,*** వరంగల్, Mobile: 9885737764

ప్రియమైన ఎలోహీం పిల్లలారా! మీ అందరికి మనరక్షకుడైన యషువ మెస్సీయ నామమున షాలోమ్.

ఈ మధ్యకాలములో మన రాష్ట్రాన్ని, దేశాన్ని, రోగాలే రాజ్యమేలుతున్నాయి. ఎక్కడ చూసిన ప్రజలు రోగాలతో సతమతమవుతున్నారు. ప్రజలంతా ఏ రోగం ఎలా వస్తుందో అనుకుంటూ భయపడుతూ బ్రతుకుచున్నారు. ఈరోగాలకు వయోభేదము లేదు. అందరికి అనగా పసిపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు కూడా వస్తున్నాయి. ప్రభుత్వాలు ఈరోగాల మీద యుద్ధాన్నే ప్రకటించినాయి. ప్రస్తుత రోగాలకు ప్రధాన సూత్రధారి, ప్రజలందరిని గడగడలాడిస్తున్న చిన్నజీవి పేరే **"దోమ".** ప్రతి వ్యక్తి ఇప్పుడు దోమల నుండి ఎలా రక్షింపబడాలని ఆలోచిస్తున్నారు.

ఈ దోమలకు, రోగాలకు, ఎలోహీం పిల్లలతో సంబంధం ఏమిటి అని అనుకొంటున్నారా? సంబంధం ఉంది. సమస్తాన్ని సృష్టించిన పరమతండ్రి తనకు భూమి మీద పిల్లలు కావాలని, వారు తనవలె పరిశుద్ధులుగా, నిర్దోషులుగా ఉండాలని అనుకొన్నాడు. అందుకే మొదటి మానవులైన ఆదాము, అవ్వలను మీరు ఫలించి అభివృద్ధి పొంది, భూమిపై విస్తరించి, భూమి మీద సకల ప్రాణులను ఏలాలని చెప్పినాడు(ఆదికాం 1:26-28) ఎలోహీం ఆశీర్వదించినట్లే ప్రజలు వందల కోట్లలో విస్తరించారు. కాని ఎలోహీం పిల్లలుగా మాత్రము బ్రతకడము లేదు ఎలోహీం పిల్లలుగా అనగా ఆయన మాట లేదా ఆజ్ఞ ద్వారా బ్రతకడము లేదు. ఎలోహీం మాటలను లేక ఆజ్ఞలను మీరుటవల్లె నేడు ప్రపంచ ప్రజలు ఎన్నో రోగాలను కొనితెచ్చుకొన్నారని ఎంత మందికి తెలుసు? లేటెస్ట్ రోగాలైన గున్యా, డెంగ్యూ, మందులేని Aids (ఎయిడ్స్), స్థూలకాయం, హార్టెటాక్ మొదలగు ఎన్నోవ్యాధులు ఇప్పుడు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి.

ప్రపంచ ఆరోగ్యసంస్థ W .H.O. కు కూడా రోగాలను ఎలా నయం చేయాలో అర్థం కావడం లేదు. ఈ మధ్యకాలంలో మన రాష్ట్రాన్ని, దేశాన్ని, గడగడలాడిస్తున్న రోగాలు గున్యా, డెంగ్యూ. వీటికి సరియైన మందులు కూడా లేవు. ఈ వ్యాధులకు ప్రధాన కారణం దోమలే. W .H.O. వారు కాని, మరి ఎవరైన దోమలకు కారణం ఏమిటి అంటే? పారిశుద్ధ్యం లేకపోవడమే అని ఘంటాపథంగా చెప్పుతారు. మన దేశంలో ఇప్పటికీ చాలా మంది ప్రజలు ఆరుబయటే మలవిసర్జన చేయటము, చుట్టూ ప్రక్కప్రాంతాలను అపరిశుభ్రముగా ఉంచటము చూస్తున్నాము. కొద్ది మంది Toilet s ఉన్నా పరిసరాలను పాడు చేయడము, పిల్లలు కూడా పరిసరాలను మలవిసర్జనాలతో అపరిశుభ్రముగా చేయడము మన దేశంలోని చాలా ప్రాంతాలలో చూస్తుంటాము.

మన దేశంలో ఉన్న ఎంతో మంది ప్రజలు ఎలోహీం లేఖనాలు (బైబిల్) చదువుతుంటారు. కాని అందులోని ఆజ్ఞలను ఎవరు ఆలోచించరు, పాటించరు, ప్రకటించరు. ఈ రోజుల్లో వస్తున్న ప్రతివ్యాధికి కారణం ఎలోహీం ఆజ్ఞలను పాటించకపోవడమే. పరమతండ్రియైన ఎలోహీం దివ్యగ్రంధమైన బైబిల్‌లో ఎన్నో బోధలు (Teachings) లేక, ధర్మసూత్రాలు వ్రాయించినారు. ఈ ధర్మసూత్రాలలో ఆరోగ్యసూత్రాలు, మన మానవాళికి ఎంతో ముఖ్యమైనవి. ఉపయోగమైనవి.

ఈ ఆరోగ్య సూత్రాలలో కొన్ని ముఖ్యమైన వాటిని గూర్చి తెలుసుకుందాము.

**1. పరిశుభ్రతకు సంబంధించిన ఆజ్ఞ లేక ధర్మం:**

3500 సం॥లకు పూర్వమే పరమతండ్రి **ద్వితియోప కాం 23:12-13 లో "మలవిసర్జనకు వెళ్ళునప్పుడు గసికను తీసుకొనివెళ్ళాలని, మలమును భూమిలో కప్పివేయాలని ఆజ్ఞాపించారు. "** కాని మానవులు ఈ అల్పమైన ఆజ్ఞను పాటించకపోవడము వల్ల ఇప్పుడు ఎన్ని రోగాలు వస్తున్నాయో ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఈ విషయాలు ఇప్పుడు తెలుసుకున్న ప్రభుత్వాలు **"ఆరుబయట మలవిసర్జన చేయుట సాంఘీక దురాచారం "** అని ప్రకటనలు ఇస్తూ, మరుగుదొడ్లు నిర్మిస్తూ కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. ఆరుబయట మలవిసర్జన చేసే వారు ఎలోహీం ఆజ్ఞ ప్రకారం మట్టిలో మలమును కప్పివేస్తే ఎన్నో రోగాలను నివారించగలము.

సృష్టిని అనుభవించాలని ఆశపడే మనిషి సృష్టికర్త ఆజ్ఞలు ఏమిటి? అని ఆలోచిస్తే మంచిది. అలాకాక ఎలోహీంఆజ్ఞలు నాకు అవసరము లేదు అని అనుకుంటే గున్యాతో వచ్చిన నొప్పులు, పసిపిల్లల మరణాలు, భయంకరమైన తెగుళ్ళు, ఎలోహీం ఉగ్రత అనుభవించక తప్పదు.

**2. ఎలోహీం ఆజ్ఞలు మీరినందుకే ఎయిడ్స్ వచ్చిందా?**

ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న అతి భయంకరమైన వ్యాధియే ఎయిడ్స్. మందు లేని యీ వ్యాధిని ప్రభుత్వాలు, మీడియా నిరోధులతో నివారించాలని కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. ముందు ఈ వ్యాధికి కారణమైన వ్యభిచారమును నివారించాలి. అది చేతకాని ప్రభుత్వాలు, మీడియా కండోమ్‌లు వాడండని ఉచితసలహాలు ఇస్తు ప్రజలను తప్పుత్రోవ పట్టిస్తున్నారు. అసలు ఈ వ్యాధి ఎలోహీం ఆజ్ఞను పాటించకపోవడము వల్లే వచ్చింది.

పరమతండ్రి స్త్రీ, పురుషులను సృష్టించి, పెళ్ళి అనే పద్ధతి ద్వారా ఆ ఇద్దరిని ఏకం చేసినాడు. కాని కొందరు స్త్రీలు, పురుషులు తమ స్వభావికమైన ధర్మమును కాదని స్త్రీలు స్త్రీలతో, పురుషులు పురుషులతో, కలుసుకొంటూ ఎలోహీం ధర్మాన్ని ఒమ్ము చేసినారు. ఇక అక్కడితో ఆగక జంతువులతో కూడా శయనించారు. అందువల్లె ఈ ఎయిడ్స్ అనే వ్యాధి వచ్చిందని, ఎయిడ్స్ పుట్టుకకు జంతువుతో సంపర్కమే కారణమని అనేక శాస్త్రవేత్తలు చెప్పుతున్నారు.

మానవుడి మేలుకోరిన ఎలోహీం 3500 సం॥లకు పూర్వమే లేవీకాం 20:15-16లో జంతువుతో సంపర్కము చేసినట్లయితే మరణశిక్ష విధించమన్నాడు. రోమా 1:26-28 వాక్యములను గమనించినట్లయితే ఎలోహీం ధర్మాన్ని కాదన్న స్త్రీ, పురుషులను భ్రష్టమనస్సుకు ఎలోహీం అప్పగించాడు. ఆనాటి నుండే మనుషులు అతి నీచముగా ఎలోహీం ఆజ్ఞలను కాదని, సుఖవ్యాధులను, ఎయిడ్స్‌ను ప్రపంచానికి అందించినారు. పాపం పండిన రోజున ఎలోహీం ఉగ్రతకు లోనుకాక తప్పదు.

**ద్వితీయోస కాం 27:21 వాక్యాన్ని చూస్తే " ఏ జంతువుతోనైనా శయనించిన వాడు శాపగ్రస్తుడని చెప్పగా సమాజమంతా ఆమెన్ (అవునుగాకని) "** అని చెప్పమన్నాడు. ఆ శాపం ఈ కాలంలో నిజమయినది. సామెతలు 5:1-14 మరియు 7:24-27లో వాక్యాలలో వ్యభిచారము వలన నష్టాలు తెలుస్తాయి. మాంసం క్షీణిస్తుంది (ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుడివలె). వ్యభిచారము అనేది పాతాళమునకు, మరణశాలలకు పోవు మార్గమని వాక్యము స్పష్టముగా వివరిస్తుంది.

**3. క్రొవ్వు తింటే కష్టాలు తప్పవు:**

నేడున్న ఆరోగ్య సమస్యలలో హార్ట్‌ఎటాక్, స్థూలకాయము ఎంతో ప్రమాదకరమైనవి. ఎందరో

హార్ట్ఎటాక్‌తో చనిపోవుచున్నారు. స్థూలకాయము సమస్యతో ప్రపంచములోని చాలామంది ప్రజలు సతమతమవుతూ, జిమ్ములకు, యోగాలకు, బ్యూటీపార్లర్లు మొదలగు వాటిచుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారు. ఈ కష్టాలు, నష్టాలు ఎరిగిన ఎలోహీం ముందుగానే ధర్మశాస్త్రములో లేవీకాం 7:23-27లో క్రొవ్వు రక్తము తినకూడదని గట్టిగా ఆజ్ఞాపించినాడు. కాని ఈ కాలంలో ఎంతమందికి ఇది ఎలోహీం ఆజ్ఞగా తెలుసు? ఎంతమంది ఈ ఆజ్ఞను పాటిస్తున్నారో అందరికి తెలిసినదే. ఏ కటికవాని అంగడిలో కూడా పూర్తిగా క్రొవ్వు, రక్తము, అంత్రములు మొదలగు ఆరోగ్యమునకు పనికిరాని అవయవములను తీసివేసి అమ్మరు. అలా అమ్మమని ప్రజలు కోరరు. కారణము క్రొవ్వు, రక్తము తినకూడదనే ఆజ్ఞలు ఎలోహీం మన ఆరోగ్యము కోసము ఇచ్చిన ఆరోగ్య ధర్మాలని తెలియవు.

**4. అపవిత్ర జీవులను తింటే అనారోగ్య సమస్యలు తప్పవు:**

ఆరోగ్యశాస్త్రాన్ని ఎరిగిన ఎలోహీం ఏ జంతువులు, పక్షులు, జలచరములు తినాలో కూడా లేవీకాం11 వ అధ్యాయములో వివరించాడు. ఎలోహీం ఆజ్ఞలు తెలియని ప్రజలు పందులు, పాములు, కప్పలు, గ్రద్దలు, పురుగులు మొదలగు అపవిత్ర జీవులను తింటూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. ఎలోహీం తినవద్దని ఆజ్ఞాపించిన అపవిత్ర జీవులను తినినచో ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని, ఆరోగ్య శాస్త్రము (వైద్యశాస్త్రము) చెప్పుతుంది. ఎలోహీం వద్దన్నవి ప్రజలకు ముద్దు (ఊబిరీశిలి) అంటే దానికి పర్యవసానాలు అనారోగ్య సమస్యలు అనుభవించక తప్పవు.మానవుని సృష్టించిన పరమతండ్రియైన ఎలోహీంకి మన అవయవ నిర్మాణము, వాటి విధులు తెలుసుకాబట్టి ఎన్నో ఆరోగ్యసూత్రాలు వ్రాయించాడు.

లేవీకాం 18:19లో కడగ (బహిష్టుగా) ఉన్న స్త్రీని, ఆమె భర్త కలుసుకోకూడదు అనే ఆజ్ఞను ఇచ్చాడు. కారణం స్త్రీ ఋతుధర్మం, ఆ సమయములో స్త్రీ రక్తస్రావము, బాధలను గూర్చి తండ్రియైన ఎలోహీంకి తెలుసు కాబట్టి.ఇంకా ఎలోహీం ఎవరిని పెళ్ళి చేసుకోవాలి, ఎవరిని పెళ్ళి చేసుకోకూడదో అనే విషయాలు లేవీ కాండము 18:6-23లో వివరించాడు. కారణం వావివరుసలు మరచి ప్రవర్తిస్తే అనారోగ్య సమస్యలు, ఎలోహీం ఉగ్రత తప్పదు. ఉదా॥ రూబేను వావివరుసలు మరచి పినతల్లితో శయనించినందుకు ఆయనకు ఏ ఒక్క దీవెన కూడా రాలేదు. తన జేష్టత్వాన్ని, యాజకత్వాన్ని, స్వాస్థ్యమును, అన్నింటిని కేవలము ఒక్క తప్పుతో కోల్పోయినాడు

ఇంకా ఎన్నో ఆరోగ్య ధర్మములను, నీటితో కడుగుకోవడము, కుష్టు, చర్మవ్యాధులు నివారణ, పూర్తిగా వండని వాటిని తినకూడదు మొదలగు ఆరోగ్యధర్మములు ఎలోహీం ధర్మశాస్త్రములో మనకోసం వ్రాయించినాడు.

**చికిత్స కంటే నివారణ ముఖ్యమంటారు.** ఎలోహీం కూడా అదే చెప్పుచున్నాడు. ఎలోహీం ఇచ్చిన ఆరోగ్య ధర్మములు పాటించడము ద్వారా రోగాలను నివారించగలము. ఎలోహీం ధర్మములు మనము పాటిస్తే అవే మనల్ని రక్షిస్తాయి.

| ఎలోహీం ఆజ్ఞ | ఆజ్ఞలు పాటించకపోవటం వల్ల వచ్చిన వ్యాధులు, లేక కష్టాలు, నష్టాలు. |
|---|---|
| మృగసంయోగము చేయకూడదు. (నిర్గమ 22:19) వ్యభిచరింపకూడదు. (నిర్గమ 20:14) | సుఖవ్యాధులు, ఎయిడ్స్ మొదలగు వ్యాధులు. కుటుంబములో ప్రేమ, శాంతి, సమాధానాలు లేక ఎప్పుడు కలహాలు. |
| కొవ్వు, రక్తము తినకూడదు. (లేవికాండం 7:23-27) | స్థూలకాయము, హార్ట్ఎటాక్ మొదలగు వ్యాధులు. |
| అపవిత్ర జంతువులు, పక్షులు, పురుగులు మొదలగునవి తినకూడదు. (లేవి 11వ అధ్యా.) | జీర్ణకోశసంబంధమైన వ్యాధులు, మరణానికి దారితీయు ఎన్నో ఆరోగ్యసమస్యలు. |
| బహిర్భూమికి ప్రత్యక్ష స్థలం ఉండాలి మలమును మట్టితో కప్పివేయాలి. ద్వితీయో. (23:12-14) | పరిశుధ్యం లేకపోవుట వల్ల మరియు దోమలు పెరిగి డెంగ్యూ, గున్యా మొదలగు వ్యాధులు వస్తున్నాయి. ఇంకా ఎన్నో కష్టాలు, నష్టాలు రాబోతున్నాయి. |

లోకంలో ఎంతో మంది ఎలోహీం పిల్లలు ఉన్నారు. కాని చాలామంది ఈఆజ్ఞలు పాటించరు, ప్రకటించరు. కారణం చాలామందికి లేఖనాలు అర్థం కాకపోవటమే. నిజమైన ఎలోహీం పిల్లలుగా ఆయన ఇచ్చిన ఆజ్ఞలలోని పరమార్థాన్ని గ్రహించి అనేకులకు ఈ ఆజ్ఞలను, ఎలోహీం రాజ్యసువార్తను ప్రకటిద్దాం. ప్రజల ఆరోగ్యం కోసమని ప్రభుత్వాలు యుద్ధాన్ని ప్రకటించాయి. మనము కూడా "నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించాలి" అన్న ఆజ్ఞను మనస్సులో ఉంచుకొని ప్రజలందరితో కలిసి పరిసరాలను శుభ్రముగా ఉంచుదాం. వీటితో పాటు మనం వాక్యం అనే ఖడ్గముతో ఎలోహీం ఆజ్ఞలను ప్రకటిద్దాం.

ఎందుకంటే ఎలోహీం ఆజ్ఞలను గైకొన్నచో భూమిమీద సుఖముగా, ఆరోగ్యముగా, శాంతి సమాధానములతో బ్రతకవచ్చు. చనిపోయిన తరువాత పరమతండ్రి వద్ద నిత్యం జీవించవచ్చు.

అందరికి షాలోమ్ (సమాధానము కలుగును గాక.)

## పాఠకులకు శుభవార్త

-మీరు **"సత్యమునకై పోరాటం"** పత్రికను మీ కంప్యూటర్‌లోనే చదువుకోవచ్చును. గనుక మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపించండి. అటులనే ఇంగ్లీష్ మెస్సెజెస్ కావలసిన వారు కూడా మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపి పొందవచ్చును. పత్రికను ఉచితంగా పొందుతున్న వారు దయచేసి ఇతరులకు పరిచయం చేయండి. పత్రికను చందా చెల్లించని వారు చెల్లించండి. ఈ పత్రిక క్రైస్తవ బోధకుల మోసం నుండి రక్షించునది గనుక బోధకులకు ఇవ్వక విశ్వాసులకే ఇవ్వండి. అబద్ధ బోధకుల బారి నుండి మిమ్మును మీరే కాపాడుకొని సత్యమును వెంబడించండి. అందరికీ షలోం.

-ఎడిటర్ & పబ్లిషర్



**2006 పస్కా పండుగలో ఆహ్వానము పలుకుచున్న బ్రదర్. ఐజక్ ఇ. కుసుమ గారు, ప్రసంగించుచున్న సహో. సంజీవరావు గారు, జనార్ధన్ గారు మరియు బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ గార్లు.**



**2006 పస్కా పండుగలో పాటలు పాడుచున్న సహో. రాజు గారు, సహో. సంధ్య గారు (విజయవాడ) మరియు ఒకరి పాదములు ఒకరు కడుగుకొనుచున్న (యోహాను 13:14) సహోదరులు, సహోదరీలు.**



తెలంగాణా ప్రాంతమైన నిర్మల్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో సువార్త పర్యటన సందర్భంలో



తెలంగాణా ప్రాంతమైన నిర్మల్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో సువార్త పర్యటన సందర్భంలో



ఏజన్సీ ప్రాంతమైన పాడేరు, అరకులోయ, బొర్ర గుహలు సువార్త పర్యటన సందర్భంలో



సీలేరులో ఒక పెద్దయనతో... చిత్తూరు జిల్లా తిరుపతి వెళ్లుచున్న సందర్భంలో ఎండదెబ్బకు సేదతీర్చుకుంటున్న సహోదరులు.